ప్రజాశక్తి
శుక్రవారం 22 డిసెంబర్ 2023



కాగితాపల్లి హెచ్ఎం సుధాకర్ మృతి

పని ఒత్తిడే కారణం

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని కాగితాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న రంప సుధాకర్ గురువారం తెల్లవారి నిద్రలోనే మృతి చెందారు. ఆయన రాజాం మండల కేంద్రంలోని తన ఇంటి వద్దనే గుండెపోటు వచ్చి మృతి చెందినట్లు కుటుంబం సభ్యులు తెలిపారు. విద్యాశాఖ అధికారులు వేధింపులతో పాటు పని ఒత్తిడి వల్లే ఉపాధ్యాయుడు సుధాకర్ మృతి చెందినట్లు ఉపాధ్యాయ జెఎసి నాయకులు ఆరోపించారు. సుధాకర్ మృతి పట్ల ఎంఇఒ ఎం. వరప్రసాదరావు, ఎరకయ్య, తోటి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు. కాగితాపల్లిలో విద్యార్థులు, తల్లిదండ్రులు సానుభూతి వ్యక్తం చేశారు.

తెలుగు తమ్ముళ్లలో నూతనుత్తేజం

- జనసేనలోనూ పెరుగుతున్న జోష్
- యువగళం సభ సక్సెస్‌తో ఇరు పార్టీల్లోనూ రాజకీయవేడి
- సమన్వయంపైనే సందేహం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

యువగళం సభ సక్సెస్ కావడంతో తెలుగు తమ్ముళ్లలో నూతనుత్తేజం కనిపిస్తోంది. అటు జనసేన పార్టీలోనూ జోష్ పెరుగుతోంది. నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలంటూ టిడిపి, జనసేన అధినేతలు నారా చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేయడంతో ఇరు పార్టీల్లోనూ రాజకీయ వాతావరణం వేడెక్కింది. భోగాపురం మండలం పోలిపల్లిలో బుధవారం నిర్వహించిన యువగళం-నవశకం సభకు ఇరు పార్టీలకు చెందిన నాయకులు జిల్లా నలుమూల నుంచి తరలి వచ్చారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల చెందిన నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చారు. జిల్లాలో మునుపెన్నడూ జరగనంత తీరులో జరగడంతో ఆయా పార్టీల కేడర్ ఆనందోత్సవంలో ఉన్నారు. కానీ.... ఆచరణలో ఇరు పార్టీలకు చెందిన నాయకుల మధ్య సమన్వయం ఎలా ఉంటుందో అన్నదానిపై సందేహాలు వ్యక్తమౌతున్నాయి. జిల్లా అంతటా కాకపోయినా కొన్నిచోట్ల జనసేన నాయకులు ఉన్నారు. వీరిలో కొంతమంది ఎన్నికల్లో పోటీకి తహతహలాడుతున్నారు. దాదాపు అన్ని నియోజకవర్గాల్లోనూ టిడిపి ఆశావహులు ఇప్పటికే చాపకింద నీరులా ఎన్నికల వ్యూహంతో పనిచేస్తున్నారు. జనసేన తరపున విజయనగరంలో పాలవలస యశశ్విని గత ఎన్నికల్లో పోటీచేసిన సంగతి తెలిసిందే. తాజాగా పొత్తు కారణంగా ఆమె స్థానం ప్రశ్నార్థకంగా మారింది. ఒకవేళ ఆమెకు టిక్కెట్ దక్కకపోతే విజయనగరంలో టిడిపికి సహకరిస్తారా? ఆమె రాజకీయ భవితవ్యం ఏమిటి? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నెల్లిమర్ల నుంచి గతంలో పోటీకి దిగిన లోకం మాదవి కూడా మళ్లీ పోటీకి ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. ఇదే నియోజకవర్గం నుంచి టిడిపి తరపున కర్రోతు బంగార్రాజు ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. ఇద్దరూ టిక్కెట్లు ఆశిస్తున్నారు. తీవ్ర ప్రయత్నాలు కూడా చేసుకుంటున్నారు. అనివార్య కారణాల వల్ల వీరుకాకుండా ఇతరుల పేర్లు తెరమీదకు వచ్చినా పరస్పర సహకారం ఏమేరకు ఉంటుందో అని జనం చర్చించుకుంటున్నారు. పొత్తులో భాగంగా జిల్లాలో ఏ నియోజకవర్గంలో జనసేన పోటీకి అవకాశం దక్కుతుందో అన్న చర్చకుడా నడుస్తోంది. ఈనేపథ్యంలో ఇరు పార్టీల్లోనూ అసంతృప్తులతో నాయకులు బయటపడితే దాన్ని అనుకూలంగా మలుచుకునేందుకు వైసిపి పావులు కదుపుతోంది. ఇటువంటి రాజకీయ పరిణామాలను ఎప్పటికప్పుడు అంచనాలు వేసుకుంటూ సమన్వయంతో ముందుకు నడిపే నాయకులు టిడిపిలో లేరనే వాదన వినిపిస్తోంది. పూసపాటి అశోక్‌గజపతిరాజు టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడిగా ఉన్నప్పటికీ మండలం, నియోజకవర్గ స్థాయిలో కిందికి దిగి సమన్వయం చేసేంత ఓపిక, సహనం లేదని ఇటు టిడిపి, జనసేన పార్టీలకు చెందిన నాయకులు చెబుతున్నారు. ఇలాంటి బలహీనతల వల్లే యువగళం సభలోనూ మాజీ స్పీకర్ ప్రతిభా భారతి మినహా జిల్లా నుంచి ఎవరికీ మాట్లాడేందుకు కూడా అవకాశం ఇవ్వలేదన్న చర్చ నడుస్తోంది.



యువగళం బహిరంగ సభకు హాజరైన టిడిపి, జనసేన కార్యకర్తలు (ఫైల్)

సబ్ ఇన్‌స్పెక్టర్ ఫలితాల్లో

సత్తా చాటిన పేదింటి పిల్లలు

ప్రజాశక్తి-విలేకర్ల బృందం

పోలీసుశాఖ నిర్వహించిన ఎస్ఐ పరీక్షా ఫలితాల్లో జిల్లాకు చెందిన పలువురు పేదింటి పిల్లలు సత్తా చాటి ఉద్యోగం సాధించారు. వీరిలో కూలీల పిల్లలు ఉండడం గమనార్హం.

కూలీ కుమార్తె ఎస్ఐగా ఎంపిక

రామభద్రపురం : నిరుపేద కూలీగా జీవనం సాగిస్తూ కుమార్తెను ఉన్నత చదువులకు ప్రోత్సహించడంతో ఆరికతోటకు చెందిన సురగాల సంధ్య ఎస్ఐగా ఎంపికైంది. ఆమె ప్రాథమిక విద్యాభ్యాసం మొదలు డిగ్రీ వరకు ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే సాగింది. చిన్నతనం నుంచి చదువుల్లో ప్రతిభ కనబర్చింది. తల్లిదండ్రులు దినసరి కూలి పనులు చేసుకొని ఆమెను ప్రోత్సహించారు. తండ్రి కృపారావు, తల్లి విమలకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు కాగా పెద్ద కుమార్తె నర్సింగ్ చేయగా, రెండవ కుమార్తె ఉన్నత చదువుల్లో ఉంది. చిన్న కుమార్తె పట్టుదలతో చదివి ఎస్ఐ గా ఎంపిక కావడం పట్ల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామ సర్పంచ్ పెంకి పుష్పమ్మ , మాజీ సర్పంచ్ భీమయ్య, ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్, హెరిటేజ్ ఫుడ్స్ డీలర్ కిల్లాడ రామకృష్ణ, పెంకి శేఖర్ బాబు హర్షం వ్యక్తం చేశారు.



ఆర్ఎస్ఐగా అనిల్

నెల్లిమర్ల: ఎపిఎస్‌పి ఆర్ఎస్ఐగా మొయిద నారాయణ పట్నంకు చెందిన యువకుడు మీసాల అనిల్ ఎంపికయ్యాడు. అనిల్ తండ్రి బంగారు నాయుడు, తల్లి సత్యవతి సాధారణ వ్యవసాయ కూలీలుగా పని చేసి చదివించారు. అనిల్ మొయిద ఉన్నత పాఠశాలలో 10వ తరగతి, గొట్లాం గాయత్రి కళాశాలలో ఇంటర్, విజయనగరం ఎంఆర్ కళాశాలలో డిగ్రీ చదువుకున్నారు. అనిల్‌ని ఎమ్మెల్సీ డాక్టర్ సురేష్‌బాబు గ్రామస్తులు అభినందించారు.



కానిస్టేబుల్ ఎస్ఐగా ఎంపిక

గరివిడి: మండలంలోని వెదుల్లవలస గ్రామానికి చెందిన పిన్నింటి శివ ఏలూరు రేంజ్ ఎస్ఐగా ఎంపికయ్యాడు. ఆయన తల్లిదండ్రులు ఇద్దరు రోజువారి కూలీ పనులు చేస్తుంటారు. ఆయన 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్నారు. శివ 2018 నుంచి విశాఖ పట్నం ప్రాంతం లో కానిస్టేబుల్ గా పని చేస్తున్నారు.



అప్పుడు అన్న.. ఇప్పుడు చెల్లి

శృంగవరపుకోట: ఆంధ్రప్రదేశ్ పోలీస్ ఫలితాల్లో సివిల్ ఎస్ఐగా జోన్2లో ధర్మవరం గ్రామానికి చెందిన పోరుపురెడ్డి సంధ్య ఎంపికయ్యారు. 2018 బ్యాచ్‌లో ఆమె అన్న పి.వై. నాయుడు రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎస్ఐగా సెలెక్ట్ అయ్యి తెలంగాణలో ఏఆర్ ఎస్ఐగా ఉద్యోగంలో చేరారు. ఇప్పుడు చెల్లి సంధ్య ఎస్ఐగా సెలెక్ట్ అయ్యారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఒకే ఇంట్లో ఇద్దరు ఎస్ఐలుగా సెలెక్ట్ అవ్వడం పట్ల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నిరుపేద రైతు బిడ్డలు

తెర్లాం : మండలంలోని ఉద్దవోలు గ్రామానికి చెందిన తమ్మిరెడ్డి ధనుంజయ ఎపి ఎస్ఐ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 4వ సాధించారు. ధనుంజయది నిరుపేద రైతు కుటుంబం. తండ్రి తమ్మిరెడ్డి గోవిందరావు 2021లో మృతి చెందగా, తల్లి కళావతి గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తూ వచ్చారు. 2019లో విశాఖలో బి.టెక్ పూర్తి చేసిన ధనుంజయ ఎస్ఐ కావాలన్న తన తండ్రి ఆశయ సాధన కోసం కృషి చేశాడు. గత ఏడాది డిసెంబర్‌లో ఎస్ఎస్‌బిలో జిడి కి ఎంపికయ్యాడు. ట్రైనింగ్ లో వుండగానే ఎస్ఐ నోటిఫికేషన్ రావటంతో ఆ ఉద్యోగాన్ని వదిలి ఎస్ఐ జాబ్ కోసం తీవ్రంగా ప్రయత్నించాడు. నాలుగో ర్యాంకు సాధించడంతో గ్రామస్తులంతా అభినందిస్తున్నారు.



తమ్మిరెడ్డి ధనుంజయ



బూరి రాజశేఖర్

విజయ రాంపురం పంచాయతీ బూరిపేటకు చెందిన బూరి రాజశేఖర్(చంటి) రాష్ట్రస్థాయిలో 2వ ర్యాంకు సాధించాడు. తల్లిదండ్రులు చంద్రినాయుడు, గౌరీశ్వరి వ్యవసాయదారులు. పెద్దకుమారుడు ఇటీవల అసిస్టెంట్ స్టేషన్‌మాస్టర్‌గా ఉద్యోగం సాధించాడు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బి. మధుసూదన రావు, జ్ఞాన సరస్వతి యువజన సేవా సంఘం అభినందనలు తెలిపారు.

జనాకర్షణ లేకే పవన్ కల్యాణ్‌ను పిలిచారు

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

టిడిపికి జనాకర్షణ లేకే పవన్ కల్యాణ్‌ను బతిమలాడుకొని తీసుకొచ్చారని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి విమర్శించారు. యువగళం సభకు పవన్ కళ్యాణ్ రానంటే 14 ఏళ్లు సిఎంగా చేసిన వ్యక్తి బతిమలాడుకొని సభకు తీసుకొచ్చిన దుస్తితి చంద్రబాబుది అని అన్నారు. గురువారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబు ఓటు అడిగే హక్కు కోల్పోవడం వల్ల జనాకర్షణ కలిగిన పవన్ కళ్యాణ్, బాలకృష్ణను తీసుకొచ్చారన్నారు. నీదగ్గర అధికారం తీసుకుంటే ఆ వ్యక్తి సైకో అవుతాడా అని ప్రశ్నించారు. గత నాలుగున్నర ఏళ్లలో 175 నియోజక వర్గంలో ఎప్పుడైనా సమస్యలపై ప్రశ్నించారా అని అన్నారు. తమ పాలనలో విద, వైద్యానికి పెద్దపీట వేశామన్నారు. బహిరంగ సభకు యావత్తు రాష్ట్రం నుంచి వస్తేగాని సభ పెట్టలేని స్థితిలో టిడిపి ఉందన్నారు. విజయనగరం నియోజక వర్గంలో చేసిన అభివృద్ధి పనులపై బహిరంగ చర్చకు రాగలరా అని సవాల్ విసిరారు.

విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పటిష్టమైన విద్యా పునాదిని వేస్తున్నారని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. జగన్మోహన్ రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని బాబా మెట్టలోని బాలికోన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మొత్తం 156మంది విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విద్యా, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. బాబామెట్టలోని ప్రాథమికోన్నత పాఠశాలను మహిళా జూనియర్ కాలేజ్‌గా మార్చాలన్నది తన ఆలోచనని చెప్పారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్‌లు శ్రావణి, లయాయాదవ్, కార్పొరేటర్ గాదం మురళి, ఎంఇఒ రాజు, హెచ్‌ఎం పి.రమణమ్మ పాల్గొన్నారు.

ఖచ్చితమైన ఓటర్ల జాబితా రూపొందించాలి

- జిల్లా పరిశీలకులు శ్యామలరావు
- గొట్లాంలో క్షేత్రస్థాయి తనిఖీ

ప్రజాశక్తి-విజయనగరం, బొండపల్లి

ఖచ్చితమైన ఓటర్ల జాబితాలను రూపొందించాలని అధికారులను, జిల్లా ఓటర్ల జాబితా పరిశీలకులు, ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జె.శ్యామలరావు ఆదేశించారు. ఆయన గురువారం జిల్లాలో పర్యటించారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్షించారు. జిల్లాలోని వివిధ నియోజకవర్గాల్లో చేపట్టిన సవరణ ప్రక్రియ గురించి ముందుగా జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి వివరించారు. దీనిపై రూపొందించిన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌ను శ్యామలరావు తిలకించారు. వివిధ అంశాలపై ఇఆర్‌ఒలను ప్రశ్నించారు. వివిధ రాజకీయ పార్టీలు ఇచ్చిన ఫిర్యాదులపై సమీక్షించారు. వాటిపై తీసుకున్న చర్యలను ఆరా తీశారు.

ధరఖాస్తుల తనిఖీ

ఫారమ్ 6,7,8 తదితర దరఖాస్తులను పరిశీలకులు శ్యామలరావు తనిఖీ చేశారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి హాజరైన బిఎల్‌ఒలు, ఆయా నియోజకవర్గాల ఎన్నికల అధికారుల సమక్షంలో దరఖాస్తుల పరిశీలన జరిగింది. అసంపూర్తిగా ఉన్న దరఖాస్తులను పరిశీలించి, సంబంధిత బిఎల్‌ఒలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్ణీత గడువులోగా దరఖాస్తుల పరిశీలన పూర్తిచేయాలని చెప్పారు. ఈ సందర్భంగా అబ్జర్వర్ మాట్లాడుతూ ఖచ్చితమైన నివేదికలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఏమైనా తప్పులు దొర్లితే నియోజకవర్గాల ఇఆర్‌ఒలు, ఎఇఆర్‌ఒలే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డిఆర్‌ఒ ఎస్‌డి అనిత, ఇఆర్‌ఓలు డి.వెంకటేశ్వర్రావు, సుదర్శన దొర, నూకరాజు, సుధారాణి, ఎంవి సూర్యకళ, బి.శాంతకుమారి, ఎ.సాయిశ్రీ , ఏఇఆర్‌ఓలు, డిటిలు పాల్గొన్నారు.



గొట్లాంలో ఓటరు జాబితాను పరిశీలిస్తున్న పరిశీలకులు శ్యామలరావు

గొట్లాంలో క్షేత్రస్థాయి తనిఖీ

ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై జిల్లా పరిశీలకులు జె.శ్యామలరావు క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. బొండపల్లి మండలం గొట్లాం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఆరా తీశారు. చేర్పులు, తొలగింపులపై ఓటర్లను ప్రశ్నించారు. బిఎల్‌ఒలు ఓటర్లకు ఇచ్చిన రశీదులను, డెత్ సర్టిఫికేట్లను తనిఖీ చేసి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో ఆర్‌డిఒ ఎం.వి.సూర్యకళ, గజపతినగరం ఇఆర్‌ఒ డి.వెంకటేశ్వర్రావు, బొండపల్లి తాహశీల్దార్ డి.ప్రసాద్, డిప్యూటీ తాహశీల్దార్ కె.సతీష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కాంతారావు

రెండోరోజుకు సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సిఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతున్నామని సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు జెఎసి రాష్ట్ర అధ్యక్షులు బి.కాంతారావు డిమాండ్ చేశారు. జిల్లాలో సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె గురువారం రెండోరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్షలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను రెగ్యులర్ చేసి, సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఎంటిఎస్ అమలు చేసి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించి ప్రతి నెలా 1వ తేదీకి వేతనాలు చెల్లించి, వార్షిక బడ్జెట్ ఒకేసారి విడుదల చేయాలన్నారు. వేతనంతో కూడిన మెడికల్ లీవులు మంజూరు చేయాలని, గ్రాడ్యుట, రూ.20లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాకు సిఐటియు నాయకులు మద్దతు తెలిపారు. సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే వరకూ సమ్మె విరమించబోమని సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు స్పష్టం చేశారు.

ఘనంగా వార్షిక క్రీడోత్సవాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బాబామెట్టలోని కేంద్రియ విద్యాలయంలో గురువారం వార్షిక క్రీడోత్సవాలు ఘనంగా జరిగాయి. క్రీడా పోటీలను ప్రిన్సిపాల్ దిలీప్ మోడీ ప్రారంభించారు. ముగింపు క్రీడోత్సవానికి యూనియన్ బ్యాంకు డిప్యూటీ రిజనల్ ఆఫీసర్ నరేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు గార్డ్ అఫ్ హానర్ తో ఆహ్వానించారు. గంగా , గోదావరి , నర్మద , యమునా నదుల పేరుమీదున్న నాలుగు హౌసెస్ కింద మొత్తం విద్యార్థులను విభజించి పోటీలు నిర్వహించారు. ఓవరాల్ ఛాంపియన్‌గా గోదావరి విద్యార్థులు నిలిచారు. క్రీడాజ్యోతి ప్రజ్వలన , మార్చ్ ఫాస్ట్ , సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులను, తల్లిదండ్రులను ఆకర్షించాయి. విజేతలకు ప్రిన్సిపాల్ దిలీప్‌మోడీ మెడల్స్ , సర్టిఫికెట్లు అందజేశారు.

చెవిలో పువ్వులు పెట్టుకొని నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తెలంగాణ కంటే వేతనాలు పెంచుతామన్నా ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని , సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె గురువారం నాటికి 10వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా గురువారం చెవిలో పువ్వులు పెట్టుకొని అంగన్వాడీలంతా కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం మానవహారం చేపట్టారు. ఆ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.పైడిరాజు, సిఐటియు నాయకులు ఎ.జగనోహన్, యుఎస్ రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చర్చలు పేరుతో సమస్యలు పరిష్కారం చేయకుండా తమ చెవుల్లో పువ్వులు పెట్టిందని అన్నారు. జగన్మోహన్ రెడ్డి మహిళా పక్షపాతి అని చెప్పుకోవడమే తప్ప మహిళలు పది రోజులుగా రోడ్లెక్కి ఆందోళన చేస్తున్నా ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు ప్రభుత్వం ఎంత ఆలస్యం చేస్తే అంత పెద్ద ఎత్తున ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమ్మెకు ఎపిటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎ.సదాశివరావు మద్దతు తెలిపారు.

గజపతినగరం : అంగన్‌వాడీలంతా చెవిలో పువ్వులు పెట్టుకొని నిరసన తెలిపారు. సమ్మెకు మద్దతుగా పలువురు తల్లులు తమ పిల్లలతో కలిసి సమ్మెలో పాల్గొన్నారు. చిన్నారులంతా 'జగన్ మామయ్యా.. మా టీచర్ల జీతాలు పెంచండి'.. వారు సెంటర్‌కు వస్తేనే మేము కూడా సెంటర్‌కు వస్తాం..' అంటూ పలకలపై రాసి నిరసన శిబిరంలో ప్రదర్శించారు. యూనియన్ నాయకులు వి.లక్ష్మి, ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు ఎం.సుభాషిని, పి.జ్యోతి, నాగమణి, రాములమ్మ, సన్యాసమ్మ, అధిక సంఖ్యలో కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.



గజపతినగరం : శిబిరంలో పాల్గొన్న చిన్నారులు



కలెక్టరేట్ వద్ద చెవిలో పువ్వులు పెట్టుకొని నిరసన తెలుపుతున్న కార్యకర్తలు

రామభద్రపురం : అంగన్వాడీల సమస్యలు పరిష్కరించ కుండా ప్రభుత్వం మీన మేషాలు లెక్కిస్తుందని ఐద్వా జిల్లా కార్యదర్శి రమణమ్మ పిలుపు నిర్చారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిర్వహిస్తున్న శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. సమ్మెలో భాగంగా అంగన్వాడీలు ప్రభుత్వ విధానాన్ని నిరసిస్తూ కోలాటం ఆడుతూ నిరసన తెలిపారు. సిఐటియు మండల కార్యదర్శి బలస శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మూడు రోడ్లు జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు.

బొబ్బిలి : మున్సిపల్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు ధర్నా నిర్వహించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించకపోతే పోరాటం ఉధతం చేస్తామని చెప్పారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఉమాగౌరి, రోజా, అంగన్వాడీలు పాల్గొన్నారు.

చీపురుపల్లి: అంగన్‌వాడీలంతా చెవిలో పువ్వులు పెట్టుకొని నిరసన తెలిపారు. ప్రభుత్వం దిగొచ్చి తమ సమస్యలు పరిష్కరించ కుంటే సమ్మె మరింత ఉధతం చేస్తామని అంగన్‌వాడీలు అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షులు బలగ నాగమణి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. గంట్యాడలో చెవిలో పువ్వులు పెట్టుకొని నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు



భోగాపురం : మోకాళ్లపై నిల్చొని బిక్షాటన చేస్తున్న అంగన్వాడీలు

జామి : తహశీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవధిక దీక్షల్లో అంగన్‌వాడీలు చెవిలో పువ్వులు పెట్టుకొని నిరసన చేపట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగొచ్చి అంగన్వాడీల డిమాండ్లు నెరవేర్చాలని, లేకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గాడి అప్పారావు, యూనియన్ నాయకులు కనక మహాలక్ష్మి, వరలక్ష్మి, కార్యకర్తలు, పాల్గొన్నారు.

శృంగవరపుకోట : ఐసిడిఎస్ కార్యాలయం ఎదురుగా సమ్మె శిబిరం వద్ద వంటా వార్పు కార్యక్రమం చేపట్టారు. సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడారు. చెలికాని ముత్యాలు, ప్రాజెక్టులీడర్ల్ డి శ్యామల, డి.జయలక్ష్మి, ఎఐటియుసి నాయకులు వి.మాణిక్యం, బి.సుశీల పాల్గొన్నారు.

బాడంగి : ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలను పరిష్కరించడానికి బదులు సమ్మె విచ్చిన్నం కోసం యత్నిస్తోందని సిఐటియు నాయకులు అన్నారు. గురువారం అంగన్‌వాడీ కేంద్రాల వద్దకు వెళ్లి తెరిచిన కేంద్రాలను మూసివేయాలని డిమాండ్ చేశారు. వాటిల్లో విధులు నిర్వహిస్తున్న ఎఎన్ఎం, ఆశా కార్యక ర్తలతో మాట్లాడి వారి విధులను సచివాలయం నుండి నిర్వహించుకోవాలని, అంగన్వాడీ కేంద్రాలకు రావొద్దని కోరారు.

25 నుంచి అంగన్వాడీల సమ్మెను ఉధృతం

భోగాపురం : ఈనెల 25 నుంచి అంగన్వాడీల సమ్మెను ఉధృతం చేస్తామని సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు టివి రమణ అన్నారు. తాహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలు పరిష్కారం అయ్యేవరకు సమ్మె చేస్తామని ఆయన అన్నారు. అంతకుముందు అంగన్వాడీలు మోకాళ్లపై నిలబడి బిక్షటన చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి బి సూర్యనారాయణ, అంగన్వాడీ ప్రాజెక్టు కార్యదర్శి ఎం.కృష్ణవేణి, సెక్టార్ లీడర్లు పి.అనిత, పి .చిన్నమ్ములు, పి.సుజాత, కె.ప్రవీణ పాల్గొన్నారు.

గురజాడ విద్యార్థుల ప్రతిభ


విజయనగరం టౌన్ : నేషనల్ ఎనర్జీ కన్జర్వేషన్ వీక్ సెలబ్రేషన్స్ 2023 సందర్భంగా ఎపిఇపిడిసిఎల్ నిర్వహించిన వ్యాస రచన, డ్రాయింగ్ జిల్లా స్థాయి పోటీల్లో గురజాడ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. పాఠశాలకు చెందిన ఆర్.రోహిత్ (9వ తరగతి) డ్రాయింగ్ పోటీలో ప్రథమ బహుమతి, ఎ.చామంతి (7 వ తరగతి) వ్యాస రచన పోటీలో ప్రథమ బహుమతి, వై.హాసిని (7వ తరగతి) తృతీయ బహుమతి సాధించారు. బహుమతులు సాధించిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ ఎం.స్వరూప, ప్రధానోపాధ్యాయులు పూడి శేఖర్ అభినందించారు.

రాష్ట్ర మహిళా కబడ్డీ విజేత కృష్ణా జిల్లా

రన్నర్‌గా విజయనగరం జిల్లా జట్టు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని మహిళా పార్కులో జరిగిన రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీల్లో విజేతగా కృష్ణా జిల్లా జట్టు నిలిచింది. విజేతలకు కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి, మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి బహుమతులను అందజేసారు. ప్రథమ స్థానంలో కృష్ణా జిల్లా నిలవగా ద్వితీయ స్థానంలో విజయనగరం, తృతీయ స్థానంలో విశాఖపట్నం, నాలుగో స్థానంలో గుంటూరు జిల్లా జట్లు నిలిచాయి. మొదటి విజేతకు రూ.50 వేలు, రెండో విజేతకు రూ.40 వేలు, మూడో విజేతకు రూ.30వేలు, నాలుగో విజేతకు రూ.20వేలు చొప్పున నగదు బహుమతితో పాటు ట్రోఫీలను అందజేశారు.



బహుమతి అందుకుంటున్న కృష్ణా జట్టు

ప్రజాశక్తి
www.prajasakti.com

బంగార్రాజును మెచ్చుకున్న చంద్రబాబు

భోగాపురం: యువగళం కార్యక్రమం విజయవంతంపై టిడిపి నెల్లిమర్ల నియోజకవర్గం ఇంఛార్జి కర్రోతు బంగార్రాజును పార్టీ అధినేత చంద్రబాబునాయుడు, నారా లోకేష్ మెచ్చుకున్నారు. మండలంలోని సన్‌రే రిసార్ట్‌లో మర్యాద పూర్వకంగా వారిని బంగార్రాజు కలిశారు. ఈ సందర్భంగా భోగాపురం విమానాశ్రయం నిర్మాణంలో గ్రామాల్లోని నిర్వాసితులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. గ్రామాలను ఖాళీ చేయించి తరలించే సమయానికి 18 సంవత్సరాలు దాటిన వారికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి ఇస్తామని మన ప్రభుత్వ హయాంలో చెప్పారని గుర్తు చేశారు. కాని వైసిపి ప్రభుత్వం వచ్చాక అలాంటి వారికి ప్యాకేజి ఇవ్వకుండా బాధితులకు అన్యాయం చేసిందని అన్నారు. బాధితులు గ్రామాల్లో నివాసం ఉన్నప్పటికి సర్వే చేసే సమయానికి బతుకు తెరువు కోసం వారు వేరే ప్రాంతానికి వెళ్లడంతో ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి కల్పించకుండా అన్యాయం చేశారని అన్నారు. బాధితులకు న్యాయం కోసం కోర్టులో వేసిన పిటిషన్‌ను చంద్రబాబుకు అందజేశారు.

బిసిలకు అత్యంత ప్రాధాన్యత

పూసపాటిరేగ : నెల్లిమర్ల నియోజకవర్గంలో బిసిలకు అత్యంత ప్రాధాన్యత కల్పిస్తున్నామని బిజెపి నియోజకవర్గ కన్వీనర్ బూర్లె శ్రీధర్ తెలిపారు. బిజెపి బిసిలు అనగదొక్కుతుందని ప్రజాశక్తిలో వచ్చిన వార్తకు ఆయన స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసిలకు పార్టీ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. పార్టీపై, తనపై బురద జల్లేందుకు పతివాడ రాజేష్ అసత్యాలను పత్రికల్లో రాయిస్తున్నాడన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులుగా పురందీశ్వరి నియామకం అయినప్పటి నుండి పతివాడ రాజేష్ పార్టీకి దూరంగా ఉంటున్నారన్నారు. పార్టీపై విమర్శలు చేసినట్లు మాట్లాడడం సహించలేనిదన్నారు. ఇప్పటికే నాలుగు మండలాల్లోని సుమారుగా 60 శాతం బూత్ కమిటీలు పూర్తి చేసామన్నారు.

విద్యార్థులకు గణిత పరీక్ష పోటీలు

వంగర: ప్రముఖ గణిత మేధావి శ్రీనివాస్ రామానుజన్ జన్మదిన వారోత్సవాలను పురస్కరించుకొని స్థానిక వివేక్ మాస్టర్ మైండ్ పాఠశాలలో గురువారం విద్యార్థులకు గణిత పరీక్ష ప్రతిభ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి ఈనెల 22న శ్రీనివాస్ రామానుజన్ జన్మదిన సందర్భంగా బహుమతులు అందజేస్తామని ప్రిన్సిపాల్ బెవర ఈశ్వర రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటపతి, హరిబాబు, ఈశ్వర్రావు పాల్గొన్నారు.

టిడిపి, జనసేనదే అధికారం

చీపురుపల్లి: రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేనదే అధికారమని టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కిమిడి నాగార్జున అన్నారు. ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడుతూ టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం – నవశకం ముగింపు సభ కనీవినీ ఎరుగని రీతిలో విజయవంతం అవడంతో పాటు ఒక నూతన అధ్యాయం సృష్టించిందని అన్నారు. సభ విజయవంతం కావడంతో వైసిపి నాయకులకు చెమటలు పడుతున్నాయని విమర్శించారు. సభను విజయవంతం చేసిన టిడిపి – జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

శృంగవరపుకోట: మండలంలోని వెంకటరమణపేట రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ రైతు కూడా తన పంటని కనీస మద్దతు ధర కన్నా తక్కువకు అమ్ముకోవాల్సిన అవసరం లేదన్నారు. ఎటువంటి మోసాలకూ తావులేకుండా రైతు భరోసా కేంద్రాలు ధాన్యం కొనుగోలు కేంద్రాలుగా కూడా పని చేస్తాయన్నారు. ఈ కేంద్రాల ద్వారా కనీస మద్దతు ధరకు రైతులు తమ ధాన్యాన్ని విక్రయించుకోవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎస్.కోట నియోజకవర్గ పరిశీలకులు తైనాల విజయ్ కుమార్, వైస్ ఎంపిపి పినిశెట్టి వెంకటరమణ, స్టేట్ ఫోక్ అండ్ కల్చరల్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, పిఎసిఎస్ అధ్యక్షుడు సాధుబాబు, స్థానిక సర్పంచ్ కోటి, ఎంపిటిసి రామచంద్రుడు, వాలంటీర్లు పాల్గొన్నారు.

గజ రాజుల ఆకృతులు ఆవిష్కరణ

విజయనగరం టౌన్: నగర సుందరీకరణలో మరో అందాల ఆకృతి మెరిసింది. స్థానిక 29వ డివిజన్ రింగ్ రోడ్డు ప్రాంతంలో ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయ ముఖద్వారం వద్ద గజరాజుల ఆకృతులను గురువారం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ఆవిష్కరించారు. భారీ ఏనుగుల చుట్టూ ఫౌంటెన్‌లను ఏర్పాటు చేసి విద్యుత్ కాంతులతో కాంతిలీనం చేశారు. దీంతో ఆ ప్రాంతమంతా కొత్త అందాలను సంతరించుకుంది. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ రూ.40 లక్షల వ్యయంతో రింగ్ రోడ్డు ప్రాంతంలో ఏనుగు ఆకృతులను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ లయ యాదవ్, జోనల్ ఇన్చార్జి కోలగట్ల కృష్ణారావు, ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్, వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు, కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు ఈశ్వర్ కౌశిక్, నగరపాలక సంస్థ ఇన్చార్జి ఇఇ దక్షిణామూర్తి తదితరులు పాల్గొన్నారు.

పిఆర్‌సి ఎరియర్స్ అందరికీ ఇవ్వాలి

విజయనగరం కోట: 2017 పిఆర్‌సి ఎరియర్స్‌ను ఉద్యోగులందరికీ ఇవ్వాలని ఎస్ డబ్ల్యు ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి యు.రాములు అన్నారు. గురువారం స్థానిక విజయనగరం ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 సర్క్యులర్‌ను విధిగా అమలు చేయాలన్నారు. నాలుగేళ్ల లీవ్ ఎన్‌క్యాష్ మెంట్‌ను వెంటనే ఇవ్వాలన్నారు. ఎస్ఆర్‌బిఎస్ పెన్షన్‌ను కొనసాగించాలన్నారు.పాత పెన్షన్ స్కీమ్‌ను అమలు చేయాలన్నారు. కేడర్ స్కేల్ పేరుతో హెచ్ ఆర్‌ఎ కోతను విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో పి.వి.రావు, కె.ఆర్.కుమార్, బి.సోమేశ్వరరావు, ఆర్‌ఎ నాయుడు, వి.రాములు, సి హెచ్.వి.రావు తదితరులు పాల్గొన్నారు.

హోమియో వైద్య శిబిరానికి స్పందన

లక్కవరపుకోట: మండలంలోని లచ్చింపేట గ్రామ పంచాయతీలో గురువారం నిర్వహించిన ప్రభుత్వ ఉచిత హోమియో వైద్య శిబిరానికి స్పందన లభించింది. హోమియో వైద్యాధికారి కోనేరు మోహనమూర్తి, ఎం. ప్రభాకరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో 94 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో ఎక్కువ శాతం కీళ్ళ నొప్పులతో బాధపడుతున్నట్లు వైద్యులు వెల్లడించారు. అనంతరం రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భూమిరెడ్డి యర్రయ్యమ్మ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచకపోతే చర్యలు

బొబ్బిలి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు హెచ్చరించారు. పట్టణంలోని రాతిపని వారివీధి, కోరాడవీధి, షాదీఖానా, అంట్యాలవీధి, శ్రీవేణుగోపాలస్వామి ఆలయం, తాండ్రపాపరాయ విగ్రహం జంక్షన్ పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. రోడ్డు, కాలువ, ఖాళీ స్థలాల్లో చెత్త వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని కోరారు. ఆయనతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



నెల్లిమర్ల: ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న ఎంపి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రామతీర్థం ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం ఎంపి బెల్లాన చంద్ర శేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పి. సురేష్ బాబు చేతుల మీదుగా బైజ్యూస్ టాబ్‌ల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో 64 మంది 8వ తరగతి విద్యార్థులకు డిజిటల్ తరహా నాణ్యమైన విద్యను అందించడానికి ట్యాబ్‌లు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం సమన్వయకర్త అంధవరపు సూరిబాబు, డిసిసిబి వైస్ చైర్మన్ చనమళ్ల వెంకటరమణ, టూరిజం డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, నగర పంచాయతీ వైస్ చైర్మన్‌లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ, నగర పంచాయతీ వైసిపి అధ్యక్షులు చిక్కాల సాంబశివరావు, వైస్ ఎంపిపిలు సారికి వైకుంఠ నాయుడు, పతివాడ సత్యనారాయణ, మాజీ సర్పంచ్ కంచరాపు రాము, ఎంఇఒ-2 ఈపు విజయ్ కుమార్, హెచ్‌ఎం ఎస్ఆర్ఎల్ శాస్త్రి పాల్గొన్నారు.

నెల్లిమర్ల: కొండవెలగాడ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబులను ఆర్‌టిసి జోనల్ చైర్మన్ గదల బంగారమ్మ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వి.జగన్ శంకర్, నాయకులు మొయిద అక్కోజీ, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ బాలి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాడంగి: మండలంలోని కోడూరు జెడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న పిల్లలకు ఎంపిపి సలహాదారు తెంటు మధు సూదన్ గురువారం ట్యాబ్స్‌ను పంపిణీ చేశారు. పిల్లలందరికీ నాణ్యమైన విద్యను అందించాలని ఉద్దేశంతో ట్యాబ్‌లను పంపణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచ్ రెడ్డికృష్ణ, ఎంపిటిసి శ్రీదేవి, వైసిపి నాయకులు కండి సురేష్, మండల విద్యాశాఖ అధికారులు, పిల్లలు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బొండపల్లి: మండలంలోని దేవుపల్లి ఉన్నత పాటశాలలో విద్యార్థులకు ఎంపిపి చల్ల చలంనాయుడు, జెడ్‌పిటిసి రాపాక సూర్యప్రకాశ రావు గురువారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. విద్యార్థులు ట్యాబ్‌లు వినియోగించుకొని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కోరారు. ఈ కార్యంక్రమంలో ఎంఇఒ శోభారాణి, ఎంఇఒ–2 అల్లు వెంకటరమణ, ఎంపిటిసి రాపాక వెంకటలక్ష్మి, వైసిపి మండల అధ్యక్షుడు బొద్దల చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మెరక ముడిదాం: మండలంలో ఎనిమిదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు గర్భాం ఆదర్శ పాఠశాలలో మండల ప్రజా ప్రతినిధులు గురువారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. మాజీ ఎంపిపి తాడ్డి వేణుగోపాలరావు మాట్లాడుతూ మండలంలో 623 ట్యాబ్ లను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో మండల పెద్దలు ఎస్ వి రమణరాజు, మండల వైసిపి అధ్యక్షులు కోట్ల వెంకటరావు, వైస్ ఎంపిపి టి. హరిబాబు, పప్పుల క్రిష్ణ మూర్తి, బి. నరేష్ కుమార్, ఎస్. జగన్ మోహనరావు, టి. చంద్రశేఖర్, రాము, పాఠశాల ప్రిన్సిపాల్ డివిఎస్ అరుణ, జెడ్‌పి హెచ్‌ఎస్ హెచ్.ఎం. ఆచార్యులు పాల్గొన్నారు.

భోగాపురం: స్థానిక మోడల్ పాఠశాలలో చదువుతున్న 100 మంది ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఎంపిపి ఉప్పాడ అనూష రెడ్డి చేతుల మీదుగా ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, ఎంపిడిఒ అప్పలనాయుడు, తహశీల్దార్ బంగార్రాజు, ఎంఇఒలు రమణమూర్తి, చంద్రమౌళి, సర్పంచులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రామభద్రపురం: స్థానిక జెడ్‌పి హై స్కూల్ ఆవరణలో ఎంపిపి లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పల నాయుడు చేతులు మీదుగా గురువారం 8వ తరగతి విద్యార్థులకు ఉచిత ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఎం కామేశ్వరరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

సైన్స్‌తోనే సాంకేతిక విప్లవం

ప్రజాశక్తి- బొబ్బిలి

సైన్సుతోనే సాంకేతిక విప్లవం సాధ్యమని రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జెసి రాజు, వి.శ్రీహరి, కోశాధికారి ఎస్.శ్రీనివాస్, జెవివి జిల్లా గౌరవ అధ్యక్షులు పోల సత్యంనాయుడు అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా నిర్వహించిన చెకుముకి టాలెంట్ పరీక్షలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మండల స్థాయిలో మెట్టవలస జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు కె.పవన్, ఎన్. హరిణి, కె.లావణ్య మొదటి స్థానంలో నిలవగా, రెండో స్థానంలో శ్రీవేణుగోపాల మున్సిపల్ పాఠశాల విద్యార్థులు ఎం.కావ్య, రమ్య, జ్యోష్ణ, మూడో స్థానంలో కారాడ మహాత్మా జ్యోతిభా పూలే గురుకుల పాఠశాల విద్యార్థులు తరుణ్, రేవంత్, ప్రవీణ్, నాలుగో స్థానంలో శ్రీవెంకటేశ్వర హైస్కూల్ విద్యార్థులు చరణ్, సాయికుమార్, జగదీష్ నిలిచారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. **రేగిడి:** మండలంలోని సంకిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించారు. దేవుదల విద్యార్థులు ప్రథమ స్థానం సాధించి జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలకు ఎంపికయ్యారని, ద్వితీయ స్థానంలో రేగిడి, లక్ష్మీపురం విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరిడాన రామినాయుడు తెలిపారు. ప్రతిభ సాధించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలతో పాటు మెమెంటోలు అందించారు. హెచ్‌ఎం తో చెకుముకి మండల కన్వీనర్ విజయ మోహన్ రావు, ప్రవీణలత, బి. పాపారావు, వి. పెంటన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ గురువారం హెచ్‌ఎం సిహెచ్ ఆనందమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలో 11 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 33మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పరీక్షలో జెడ్‌పి బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన పి. సౌభాగ్య, కె. శరణ్య, కె. జీవన ప్రీతి, ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించారు. వీరిని హెచ్‌ఎం ఆనంద మూర్తి, జన విజ్ఞాన వేదిక మండల కన్వీనర్లు పి. సత్య ప్రకాష్, బి. రమణా రావు, వెంకు నాయుడు, అమర్ నాథ్ అభినందించారు.**రామభద్రపురం:** చెకుముకి పోటీల నిర్వహణ వల్ల విద్యార్థుల్లో సైంటిఫిక్ దృక్పథం కలుగుతుందని జనవిజ్ఞాన వేదిక నాయకులు శశిభూషణ్, విజయగౌరి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా డెప్యూటీ డిఇఒ బ్రహ్మాజీ, ఎంఇఒలు తిరుమల ప్రసాద్, పెంటయ్య ప్రధానోపాధ్యాయులు కామేశ్వరరావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సైన్స్ సంబరాలలో ప్రథమ స్థానంలో విజేతలైన ఆరికతోట విద్యార్థులకు, ద్వితీయ స్థానంలో నిలిచిన రామభద్రపురం, రొంపల్లి విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

17,400 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ : ఆర్‌డిఒ

మెంటాడ: డివిజన్ పరిధిలో 17,400 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు ఉత్తర్వులు వెలువడ్డాయని ఆర్‌డిఒ సాయిశ్రీ వెల్లడించారు. అందులో భాగంగా ప్రస్తుతం నెల్లూరు జిల్లాలో 671 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరిగిందని, ప్రస్తుతం రైతుల కల్లాల్లో 1700 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ ఉన్నాయని త్వరలో మిల్లర్లు వీటిని కొనుగోలు చేసే విధంగా ఉత్తర్వులు జారీ చేస్తామని ఆమె తెలిపారు. ఇప్పటివరకు చల్లపేట, ఇప్పలవలస చాలా వరకు మిల్లర్లు బీజేలు సమర్పించారని, మిగతా మిల్లర్లు సమర్పించాలని ఆదేశించామని ఆమె అన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వ నిబంధనలు మేరకు కొనుగోలు చేయాలని రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వెంకటేశ్వర రైస్ మిల్ ధాన్యం సేకరణలో రైతులకు ఇబ్బందులు పెడుతున్నారని కొందరు రైతులు ఫిర్యాదు మేరకు మిల్లుకు వెళ్లి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సహదేత్ వెంకట్ త్రివినాద్, తహశీల్దార్ రామకృష్ణ, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె నోటీసు

నెల్లిమర్ల: ఈ నెల 26 నుంచి జరిగే రాష్ట్ర వ్యాప్త సమ్మెలో పాల్గొంటామని నగర పంచాయతీ కమిషనర్ బాలాజీ ప్రసాద్‌కు మున్సిపల్ కార్మికులు గురువారం సమ్మె నోటీసు అందించారు. సిఎం మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.జగన్మోహన్‌రావు, సిఐటియు జిల్లా కార్యదర్శి యూఎస్ రవి అన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష నేతగా, మహా సంకల్ప యాత్రలో మున్సిపల్ కార్మికులందరినీ ఆరు నెలల్లో పర్మనెంట్ చేస్తామని, వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తానని చేసిన వాగ్దానం నేటికి ఆచరణకు నోచుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. సమ్మె నోటిసు అందించిన వారిలో నగర పంచాయతీ కార్మికుల బాబురావు, శ్రీను, హరిబాబు, లక్ష్మి, సరస్వతి, గౌరీ, శ్యామల, వెంకటమ్మ, ఉమా, రాము, సీతారాం, వెంకటి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్‌ల పరిశీలన

బొండపల్లి: మండలంలోని గొట్లాంలోని పోలింగ్ స్టేషన్‌లను గురువారం ఎలక్ట్రోరల్ రోల్ పరిశీలకుడు జె.శ్యామలరావు పరిశీలించారు. ఈ మేరకు గ్రామంలో గల 147,148,149 పోలింగ్ స్టేషన్‌లను పరిశీలించి బిఎల్‌ఒల నుంచి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీలో భాగంగా క్షేత్ర స్థాయిలో ఉన్న స్థితిగతులను అధ్యయనం చేశారు.

మూడో స్నాతకోత్సవ వేడుకలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఈ నెల 23న సెంచూరియన్ విశ్వవిద్యాలయం మూడో స్నాతకోత్సవ వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి చెప్పారు. గురువారం విశ్వవిద్యాలయంలో స్నాతకోత్సవం పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వేడుకల్లో ఒకరికి గౌరవ డాక్టరేట్‌ను, 140 మందికి డిగ్రీలను ప్రధానం చేస్తున్నట్లు ప్రకటించారు. 12 మందికి బంగారు పతకాలు, ఏడుగురికి నగదు ప్రోత్సాహకాలను అందించనున్నామన్నారు. విశ్వవిద్యాలయంలో నాణ్యమైన నైపుణ్య విద్యను అందిస్తున్నామన్నారు. సంప్రదాయ విద్యా పద్ధతులలో గాకుండా ఆచరణాత్మక పద్ధతుల్లో విద్యను బోధించడం వల్ల విద్యార్థులు మెరుగైన ఫలితాలను సాధిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం అమల్లో ఉన్న కోర్సులతో పాటు వచ్చే విద్యా సంవత్సరం నుంచి బిఎస్‌సి వ్యవసాయం, ఫిజియోథెరపీ, కార్డియో వాస్క్యులర్, బిఎస్‌సి నర్సింగ్ వంటి కొత్త కోర్సులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి మాట్లాడుతూ నేడు మార్కెట్లో డిమాండ్ ఉన్న కోర్సులను ఇక్కడ అందుబాటులో ఉంచామని తెలిపారు. ఈ వేడుకలకు ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు, ప్రెసిడెంట్ ప్రొఫెసర్ ముక్తికాంత మిశ్రా, వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డి.ఎన్.రావుల తోపాటు ముఖ్య అతిధిగా లార్సెన్ అండ్ టోబ్రో ఇన్ఫోటెక్ సాఫ్ట్ వేర్ సంస్థలోని మైండ్ ట్రీ విభాగం చీఫ్ సస్టయినబిలిటీ ఆఫీసర్ పణీష్ రావు పాల్గొంటారని వివరించారు. ఈ సమావేశంలో డీన్ డాక్టర్ మాధవరావు, డీన్ ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, డీన్ డాక్టర్ సన్నీ డయోల్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త కోర్సులు ప్రారంభం

వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ మహంతి

న్యాయవాదులు విధుల బహిష్కరణ

ప్రజాశక్తి- శృంగవరపుకోట, విజయనగరం లీగల్

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన నూతన భూహక్కు (ఎపి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్) చట్టాన్ని రద్దు చేయాలన్న డిమాండుతో విజయనగరం జిల్లా కోర్టు, ఎస్.కోట కోర్టు న్యాయవాదులు గురువారం విధులను బహిష్కరించారు. చేసిన నూతన భూహక్కు చట్టానికి నిరసనగా ఈ నెల 22వ తేదీ వరకు వరుసగా మూడు రోజుల పాటు కోర్టు విధులను బహిష్కరించి ప్రదర్శనలు చేస్తున్నామని న్యాయవాదుల సంఘం ఎస్.కోట అధ్యక్ష, కార్యదర్శి అల్లు సత్యాజీ, డబ్ల్యు.ఎన్. శర్మ వెల్లడించారు. వారు మాట్లాడుతూ భూ తగాదాలకు సంబంధించిన కేసులను ఆర్‌డిఒలు, ఎంఆర్‌ఒల పరిధిలోకి బదలాయించడం తగదన్నారు. ఆ చట్టాన్ని వెంటనే నిలిపి వేయాలని, లేకుంటే రిలే నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. ఇప్పటికైనా నూతన భూహక్కు చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించాలని కోరుతూ నినాదాలు చేశారు. సీనియర్ న్యాయవాదులు జి. సూరిదేముడు, గేదెల ప్రకాష్, బి.త్రిమూర్తులు, ఎం.చంద్రశేఖర్, టీవీఆర్ మూర్తి, ఎం.అనూరాధ, బీవీఎస్ రామారావు, బి.సత్యనారాయణ, ఆర్.సత్యనారాయణ, బి.వెంకటరావు, సీహెచ్ఆర్‌ఏ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

'లెండి'లో సిక్స్ సిగ్మాపై వర్క్‌షాపు

ప్రజాశక్తి- డెంకాడ

లెండి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో సిక్స్ సిగ్మాపై రెండు రోజుల వర్క్‌షాప్ ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గా ఎన్ఎస్‌టిఎల్ సైంటిస్ట్ డివి.శ్రీనివాసరావు పాల్గొని వివిధ ఇంజినీరింగ్ కళాశాలల మెకానికల్ విభాగ చివరి సంవత్సరం విద్యార్థులకు ఉత్పత్తి అభివృద్ధి, నాణ్యత నియంత్రణ, గణాంక ప్రక్రియ నియంత్రణ పరంగా సిక్స్ సిగ్మా పాత్రను వివరించారు. శుక్రవారం లెండి కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ కె.శ్రీధర్ సిక్స్ సిగ్మా గ్రీన్ బెల్ట్ కోసం స్టాటిస్టికల్ టూల్స్ గురించి మాట్లాడనున్నారని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వివి.రామారెడ్డి మాట్లాడుతూ వర్క్‌షాప్‌లు చేయడం సాంకేతిక పరిజ్ఞానం, సరికొత్త విషయాలు గురించి తెలుసుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో వర్క్‌షాప్ కన్వీనర్, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ సతీష్ పూజారి, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ కె.సి.హెచ్.శేఖర్, రిసోర్స్ పర్సన్ కె. శ్రీధర్ మెకానికల్ విభాగం అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి- రేగిడి



వేపాడ: తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న విఆర్‌ఎలు

మండలంలో పనిచేస్తున్న విఆర్‌ఎల సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని తహశీల్దార్ బి సుదర్శన్ రావుకు విఆర్‌ఒల సంఘ నాయకులు జగన్, రాజు, పాదాల రావు గురువారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ మాదిరిగా విఆర్‌ఎలకు పేస్కేలు వర్తింపజేయాలన్నారు. నెలవారి జీతభత్యాలు రూ.26వేలకు పెంచాలని అదనపు విధులు తప్పించాలని కోరారు. రికవరీ చేసిన మొత్తం విఆర్‌ఎ ఖాతాలోకి ప్రభుత్వ జమ చేయాలని కోరారు. విఆర్‌ఎల సమస్యలు పరిష్కారానికి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్తానని తహశీల్దార్ హామీ ఇచ్చారు. పలువురు విఆర్‌ఎ సంఘ నాయకులు పాల్గొన్నారు.

వేపాడ : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం విఆర్‌ఎలు నిరసన తెలిపారు. జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. వేతనాలు పెంచాలని పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ ప్రసన్నకుమార్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఎల సంఘం అధ్యక్షుడు గట్టు వెంకన్న, పి. మహేష్, ఎం అప్పారావు, టి. దేవుడు. గవిరేసు దేవుడమ్మ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస: విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విఆర్‌ఎల సంఘం ఆధ్వర్యంలో గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. తహశీల్దార్ శ్రీనివాస్ మిశ్రాకు వినతి పత్రం అందించారు. ఈ ధర్నా చుక్క సూరిబాబు, డి. మహేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగింది.

భోగాపురం: విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలంటూ సిఐటియు జిల్లా కార్యదర్శి బి సూర్యనారాయణ ఆధ్వర్యంలో గురువారం తహశీల్దార్ బంగార్రాజుకు వినతి పత్రం అందజేశారు. అంతకు ముందు విఆర్‌ఎలు తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు.

విజయనగరం టౌన్: విఆర్‌ఎలకు పే స్కేల్ అమలు చేయాలని, డిఎ బకాయిలు చెల్లించాలని, బిఎల్‌ఒ విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యంలో గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి విఅర్‌ఎల సంఘం జిల్లా అధ్యక్షుడు గురుమూర్తి, సిఐటియు నాయకులు బి.రమణ మాట్లాడుతూ విఆర్‌ఎలకు సంబంధం లేని పనులు చేయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శ్రమ దోపిడీ చేస్తుందన్నారు. ధర్నాలో విఅర్‌ఎలు రాం గోపాల్, కె.ప్రసాద్, సన్యాసప్పడు, వీరాస్వామి, సూర్యనారాయణ, విఅర్‌ఎలు పాల్గొన్నారు.

ఆర్‌బికె, విలేజ్ క్లినిక్ కేంద్రాలు ప్రారంభం

గరివిడి: మండలంలోని కాపుశంభం గ్రామంలో రైతు భరోసా కేంద్రం, వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్ నూతన భవనాలను జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో భాగంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించి వివిధ సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధి బోర్డును సచివాలయం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లాపరిషత్ చైర్మన్ మాట్లాడుతూ అర్హతను ప్రామాణికంగా చూసే ప్రభుత్వం జగనన్న ప్రభుత్వం అని అన్నారు. విద్య, ఆరోగ్యం పరంగా మన ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మీసాల విజయలక్ష్మి, విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

మొబైల్ యాప్‌పై అవగాహన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రెడ్ క్రాస్ నూతన భవనంలో స్వచ్ఛంద రక్తదాతలకు ఎపి రెడ్ క్రాస్ మొబైల్ యాప్‌పై గురువారం చైర్మన్ కె.అర్.డి.ప్రసాద్‌రావు, సెక్రెటరీ కె.సత్యం ఆధ్వర్యాన అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన చిన్న శీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరి సహస్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వచ్ఛంద రక్తదానం వల్ల రెడ్ క్రాస్ సొసైటీకి రాష్ట్ర శాఖ నుండి ప్రశంసా పత్రం రావటం ఎంతో ఉపయోగకరంగాను ఉంటుందని అన్నారు. అనంతరం రెడ్ క్రాస్ చైర్మన్ కెఆర్‌డి ప్రసాద్ రావు, కార్యదర్శి కె.సత్యం మాట్లా డుతూ రెడ్ క్రాస్ ద్వారా చేసే సేవా కార్యక్రమాల వివరా లను యువతకు వివరించారు. కార్యక్రమంలో స్వచ్ఛంద రక్తదాతలు పాల్గొన్నారు.

పలు చోట్ల సిఎం జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- బొబ్బిలి

రాష్ట్రంలో సిఎం జగన్మోహన్ రెడ్డి అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో గురువారం సీఎం జగన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు సమక్షంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, నాయకులు శంబంగి వేణుగోపాలనాయుడు, వైసిపి పట్టణ అధ్యక్షులు చోడిగంజి రమేష్ నాయుడు, కౌన్సిలర్లు, పాల్గొన్నారు.

చీపురుపల్లి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోన్ రెడ్డ పుట్టిన రోజు వేడుకలు మండల వైసిపి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలలో ఎంపి బెల్లాన చంద్రశేఖర్, స్థానిక ఎంపిపి ఇప్పిలి వెంకటనర్సమ్మ, జెడ్‌పిటిసి వలిరెడ్డి శిరీష, చీపురుపల్లి సర్పంచ్ మంగళగిరి సుధారాణిలతో కలసి కేక్ కట్ చేశారు. అనంతరం వైసిపి నాయకులు, కార్యకర్తలకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు, వృద్ధాశ్రమంలో ఉన్న వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి అధ్యక్షులు ఇప్పిలి అనంతం, జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి వలి రెడ్డి శ్రీనివాస నాయుడు, పట్టణ వైసిపి అధ్యక్షులు పతివాడ రాజారావు, పాల్గొన్నారు.

మెంటాడ: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మరిన్ని పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలని వైసిపి మండల అధ్యక్షులు రాయిపిల్లి రామారావు, ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు అన్నారు. మండల పరిషత్ సమావేశ భవనంలో జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు గురువారం నిర్వహించారు. ముందుగా పిట్టాడ వైయస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసారు. అనంతరం మండల కాంప్లెక్స్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు సారికి ఈశ్వరరావు, పొట్టంగి దుర్గ, సర్పంచుల సంఘ అధ్యక్షులు రేగిడి రాంబాబు, పాల్గొన్నారు.

గజపతినగరం: సిఎం జన్మదిన వేడుకలను ఎంపిపి బెల్లాన జ్ఞాన దీపిక, జెడ్‌పిటిసి గార తవుడు ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. అనంతరం కార్యకర్తల సమక్షంలో జన్మదిన కేకును కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. **భోగాపురం:** స్థానిక మండలం పరిషత్ కార్యాలయం వద్ద సిఎం పుట్టిన రోజు సందర్భంగా వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఎంపిపి ఉప్పాడ అనూష రెడ్డి కేక్ కట్ చేశారు. ఎ.రాయివలస పంచాయతీ కార్యాలయం వద్ద జగన్మోహన్ రెడ్డి 51 పుట్టినరోజు సందర్భంగా 51కేజీల కేకును రాష్ట్ర హౌసింగ్ బోర్డ్ డైరెక్టర్ ఉప్పాడ శివారెడ్డి కట్ చేశారు. భోగాపురం పంచాయతీ కార్యాలయం వద్ద వైకాపా నాయకులు కందుల రఘుబాబు కేకని కట్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుభోసన రావు, బైరెడ్డి ఎర్రప్పల నారాయణ, సుందర హరీష్, పడాల శ్రీనివాసరావు, భాను, ఉప్పాడ విజయభాస్కర్ రెడ్డి, వాసుపల్లి రెయ్యుడు, పాల్గొన్నారు.

ఆకుల పేటలో దుప్పట్లు పంపిణీ

డెంకాడ: సిఎం పుట్టినరోజు వేడుకలు స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో పార్టీ అధ్యక్షుడు ఎంపిపి బంటుపల్లి వెంకట్ వాసుదేవరావు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు, 51 కేజీ కేకును కట్ చేసి శుభాకాంక్షల తెలిపారు. ఆకులపేటలో సర్పంచ్ సువ్వాడ రమేష్ పలువురు పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ రొంగలి కనక సింహాచలం, పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు.**కొత్తవలస:** సిఎం పుట్టిన రోజు వేడుకలను స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, జెడ్‌పిటిసి నెక్కల శ్రీదేవి, పిఎసిఎస్ అధ్యక్షులు గొరపల్లి శివ పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వై. పద్మజ, ఎంఇఒలు జి. శ్రీదేవి, బి.శ్రీనివాసరావులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జన్మదినం పురస్కరించుకొని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పట్టణంలోని దేవి గుడి జక్షన్ వద్ద ఉన్న వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి, ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకి పండ్లు, రొట్టేలు పంపినీ చేశారు. అనంతరం ఎస్.కోట ప్రభుత్వ పాఠశాలలో ట్యాబ్స్ పంపినీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్ కుమార్, వైస్ ఎంపిపి పినిశెట్టి వెంకటరమణ, స్టేట్ ఫోక్ అండ్ కల్చరల్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, కూనిరెడ్డి వెంకటరావు, గట్రెడ్డి పైడితల్లి, వీరనారాయణం సోంబాబు, వార్డు సభ్యులు మజ్జి శేఖర్, చింతల నారాయణమూర్తి, ఎలమంచిలి అప్పారావు, పాల్గొన్నారు. **విజయనగరం టౌన్:** ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి జన్మదినోత్సవ వేడుకలు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. వైసిపి నగర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి కేకు కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. నిరుపేద వికలాంగులకు బ్యాటరీతో నడిచే త్రిచక్ర వాహనాలను అందజేశారు. ఈ సందర్భంగా ఫ్లోర్ లీడర్ ఎస్‌వి రాజేష్, వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు మాట్లాడారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, ఎంపిపి మామిడి అప్పలనాయుడు, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చులయ యాదవ్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, పాల్గొన్నారు.